# నవగ్రహ పూజా మహిమ

## ఏలూరు 82వ శ్రీరామకోటి మహోత్సవములో

పౌరాణిక సార్వభౌమ. ప్రణవ పీఠాధిపతి

**శ్రీశ్రీశ్రీ వద్దిపర్తి పద్మాకర్** గారు

త్రిభాషా మహా సహస్రావధాని ఏలూరు

నవగ్రహాలపై ప్రత్యేకంగా అనుగ్రహభాషణం చేసారు. వారి ప్రవచనాలను వారిచేతనే సులభశైలిలో రచింపజేసి భక్తుల కోసం ముద్రించి ఇవ్వాలని భగవదనుగ్రహంతో సంకల్పించాము. భక్తులు ఈ పుస్తకం వినియోగించుకొని నవగ్రహాల అనుగ్రహపాత్రులై తరించగోరుచున్నాము.

**2014**



**2014**

## శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం (రి)

అగ్రహారం. శ్రీ రామనామ క్షేత్రం, ఏలూరు

గౌరవ అధ్యక్షులు : **కొట్టు సత్యనారాయణ**

| అధ్యక్షులు | ప్రధాన కార్యదర్శి |
|---|---|
| **గాదంశెట్టి రమేష్ కుమార్** | **వేమా గురవయ్య** |

ప్రచురణకు సహరించినవారు

**గాదంశెట్టి వేంకట చలపతిరావు, లీలావతి ఫౌండేషన్**

**ఏలూరు**

శ్లో॥ ఆదిత్యాయచ, సోమాయ, మంగళాయ, బుధాయచ
గురు, శుక్ర, శనిభ్యశ్చ, రాహవే, కేతవే నమః

# నవగ్రహ స్తోత్రమ్

1 రవి : జపాకుసుమ సంకాశం। కాశ్యపేయం మహాద్యుతిమ్
తమోరిం సర్వపాపఘ్నం। ప్రణతోస్మి దివాకరమ్ ॥

2 చంద్ర : దధి శంఖ తుషారాభం। క్షీరోదధి సముద్భవమ్
నమామి శశినం సోమం। శంభోర్మకుట భూషణమ్।

3 కుజ : ధరణీగర్భ సంభూతం। విద్యుత్కాంతి సమప్రభమ్
కుమారం శక్తి హస్తం। తం. మంగళం ప్రణమామ్యహమ్।

4 బుధ : ప్రియంగు కలికాశ్యామం - రూపేణా ప్రతిమం బుధమ్
సౌమ్యం సౌమ్యగుణోపేతం। తం బుధం ప్రణమామ్యహమ్।

5 గురు : దేవానాంచ ఋషిణాంచ - గురుం కాంచన సన్నిభమ్
బుద్ధిమంతం త్రిలోకేశం - తం నమామి బృహస్పతిమ్।

6 శుక్ర : హిమకుంద మృణాళాభం। దైత్యానాం పరమం గురుమ్
సర్వశాస్త్ర ప్రవక్తారం। భార్గవం ప్రణమామ్యహమ్।

7 శని : నీలాంజన సమాభాసం। రవిపుత్రం యమాగ్రజమ్
ఛాయామార్తాండ సంభూతం - తం నమామి శనైశ్చరమ్

8 రాహు: అర్ధకాయం మహావీరం। చంద్రాదిత్య విమర్దనమ్
సింహికాగర్భ సంభూతం, తం రాహుం ప్రణామామ్యహమ్।

9 కేతు : పలాశ పుష్ప సంకాశం। తారకాగ్రహ మస్తకమ్
రౌద్రం రౌద్రాత్మకం ఘోరం। తం కేతుం ప్రణమామ్యహమ్॥

పై గ్రహ స్తోత్రముల పఠనం వల్ల దారిద్ర్య దుఃఖ బాధలు, పీడలు, శారీరిక మానసిక రోగాలు తొలగుతాయి. సర్వకార్య విజయాలకు, విద్యా ఉద్యోగ వ్యాపారాది లాభాలకు, మనో వాంఛా పూర్తికి ఇది మంచి స్తోత్రము.

# 1. సూర్యుడు



**సూర్య మంత్రం : ఓం హ్రాం హ్రీం హ్రౌం సః సూర్యాయనమః**

దీనిని 6 వేలు సార్లు జపిస్తే మంచిది. జపం చేసేవారిద్వారా చేయించుకుంటే మరీ మంచిది. దానం **గోధుమలు, రత్నం, కెంపు,**

సూర్యుడు గ్రహరాజు. పరమాత్మ ఈయన ఒక హిరణ్మయమైన అండం లేక. గోళంగా తొలిసారి ఆవిర్భవించి ఉగ్రమైన తేజస్సుతో ఉండేవాడని మార్కండేయపురాణం చెపుతోంది.

పూర్వం బ్రహ్మ పుత్రుడైన దక్షుని కూతుర్లలో అదితి, దితిమున్నగువారు, కశ్యప ప్రజాపతిని వివాహం చేసుకొన్నారు. అదితికి ఇంద్రాది దేవతలు, దితికి రాక్షసులు పుట్టారు. దైత్యులు దేవతలను చావగొట్టడంతో పిల్లల దుస్థితికి వగచిన అదితి, భర్తతో కలసి సూర్య దేవుని ఉపాసించింది. సూర్యుడామెకు వరాలిచ్చి ఆమెకు పుత్రుడుగా జన్మించాడు. అదితికి పుత్రునిగా జన్మించాడు కాబట్టి ఆయనను అదిత్యుడు అన్నారు. సూర్యుడు కడుపులో ఉన్నప్పుడు అదితి ఉపవాసాలతో ఉండగా పిల్లవానిని ఉపవాసాలతో చంపుతావా అని, కశ్యపుడు కోపించాడు, అదితిపై (కిం మారయసి గర్భాండాన్ని మితినిత్యోపవాసిని అని మార్కేండేయపురాణం) మారితమని గర్భాండాన్ని గూర్చి అదితితో కశ్యపుడు పలకటంతో బాలునికి మార్తాండుడు అని పేరు వచ్చింది. ఆయన వారాలలో తొలివారం, అనగా ఆదివారానికి అధిపతి. ఈయనకు భూః భువః సువః అనే వ్యాహృతులు సూక్ష్మరూపాలు మహః జనః తపః సత్యములనేవి స్థూల రూపాలు. ఇవే తరువాయి కాలంలో లోకాలయ్యాయని ఇవే సూర్యుని రథానికి గుఱ్ఱాలని కూడా ప్రతీతి.

సూర్యుడు మేరువు చుట్టూ ప్రదక్షిణం చేస్తూ రాత్రి, పగలు ఏర్పరుస్తాడు. ఈయన అదితి కోరిక మీద ఇంద్రాదులను పీడిస్తున్న దైత్యులను భస్మం

చేసాడు. సూర్యుని వేడికి లోకాలు తల్లడిల్లి పోవడమేకాక బ్రహ్మ సృష్టి నాశనమైపోవటంతో బ్రహ్మ సూర్యుని ప్రార్థించాడు. దానితో సూర్యుడు తన తేజస్సును చాలా వరకు ఉపసంహరించుకున్నాడు. తదనంతరం విశ్వకర్మ కుమార్తె సంజ్ఞా దేవిని సూర్యుడు వివాహం చేసుకున్నాడు. వారికి వైవస్వతుడు అనే మనువు ( వివస్వాన్ అనగా సూర్యుడు, అయన పుత్రుడు గనుక వైవస్వతుడు అన్నారు) యమధర్మరాజు, యమునానది జన్మించారు. ఏదో కాపురం చేసినా పిల్లలు కలిగినా మొదటి నుండి సూర్యుని తేజస్సును భరించలేకుండా ఉన్న సంజ్ఞ ఒకనాడు తన నీడకు ప్రాణం పోసి దానికి ఛాయా దేవి అని పేరు పెట్టి తన భర్తను, పిల్లలను జాగ్రత్తగా చేసుకోమని తాను పుట్టింటికి పోతున్నానని ఈ నిజం ఎప్పటికి తన భర్తకు తెలియనీయవద్దని కోరింది. భర్త శపిస్తానని బెదిరించేవరకు ఈ నిజం చెప్పనని ఛాయ బదులిచ్చింది. సంజ్ఞాదేవి విశ్వకర్మ దగ్గరకు వెళ్లిపోయింది. విశ్వకర్మ కూతురిని ఆదరించాక ఒకనాడు "అమ్మాయి! భార్యకు భర్త దైవం నీవింక పుట్టింట ఉండకూడదు. భర్త దగ్గరకు పో" అన్నాడు. దానితో సంజ్ఞ పుట్టిల్లు విడిచి భర్త దగ్గరకు పోలేక ఆడ గుఱ్ఱం రూపం ధరించి ఉత్తర కురుభూములకు పోయి తపస్సు చేసుకో సాగింది. ఈలోగా ఛాయకు సావర్ణి అను పుత్రుడు పుట్టాడు. ఇతడే రాబోయే కాలంలో బలి ఇంద్రుడయ్యే సమయంలో ఎనిమిదవ మనువు అవుతాడు. తరువాత ఛాయకు శనైశ్చరుడు పుట్టాడు. తరువాత తపతి అను కూతురు పుట్టింది. ఈమెను సంవరణుడనే మునికి ఇచ్చి వివాహం చేసాడు సూర్యుడు.

తనకు పిల్లలు పుట్టాక సవతి పిల్లలపై ఆదరణ తగ్గించింది, ఛాయ. వైవస్వత మనువు ఇది గ్రహించి కూడా శాంతంగా ఊరుకున్నాడు గాని ఛాయ ప్రవర్తనకు విసిగిన యముడు కాలెత్తి తన్నబోయాడు. తనపై కాలెత్తిన యముని చురచుర చూసి ఛాయ "నీ కాలు తెగి నేలపై

పడిపోవాలని"శపించింది. యముడు తండ్రి దగ్గరకు వెళ్ళి "నాన్నా! ఈమె నా తల్లి కాదు. తల్లి బిడ్డలను ఇలా శపించదు. పైగా వైవస్వతుడు ఈమె మన తల్లి కాదని ఎప్పుడో అనుమానించాడు". అనగా సూర్యుడు ఛాయా దేవిని నిజం చెప్పమని లేకపోతే శపిస్తానని గర్జించి అడిగాడు. ఛాయ భయంతో నిజం చెప్పింది. అప్పుడు సూర్యుడు విశ్వకర్మ దగ్గరకు వెళ్లి తన భార్య గురించి అడగగా తన కూతురుని తాను ఎప్పుడో పంపివేసానని సమాధానమిచ్చాడు ఆయన. సూర్యుడు దివ్య దృష్టితో సంజ్ఞాదేవి ఉత్తరకురు భూములలో బడబా (ఆడ గుఱ్ఱం) రూపంలో తపస్సు చేస్తున్నదని గ్రహించి విశ్వకర్మతో తన తేజస్సును తగ్గించమని కోరాడు.

విశ్వకర్మ సూర్యుని శాకద్వీపానికి తీసుకునిపోయి ఒక చక్రంలో సూర్యుని అమర్చి సానపట్టి సూర్యుని కాంతిలో ఒక భాగం ఆయనలోనే ఉంచి తక్కిన పదిహేను భాగాలు విభజించి వాటితో విష్ణువునకు సుదర్శన చక్రం, శివునకు శూలం, కుబేరునికి శిబిక, కాలునికి దండము, కుమారస్వామికి శక్తి ఇంకా దేవతలకు రకరకాల ఆయుధాలు చేసి ఇచ్చాడు. ఈ విధంగా తేజస్సు తగ్గిన సూర్యుడు గుఱ్ఱం రూపంలో సంజ్ఞాదేవి దగ్గరకు వెళ్ళి ఆమెను వరించాడు. అదిగో అప్పుడే వారికి అశ్వినులు, ఆపై రేవంతుడు పుట్టారు. ఈ సూర్య చరిత్ర పరమపవిత్రం. కీర్తిని, ఐశ్వర్యాన్ని చదివిన వారికి ప్రసాదిస్తుంది. ఆపదలు తొలగిపోతాయి. ఆరోగ్యం కలుగుతుంది.



## 2. చంద్రుడు

**చంద్రమంత్రం : ఓం శ్రాం శ్రీం శ్రౌం, సః చంద్రమసేనమః**

దీనిని 10వేలు సార్లు జపం చేసినా లేదా చేయించుకొన్నా మంచిది.

చంద్రినికి "ముత్యం" ప్రీతి. దానం – బియ్యం

అత్రి మహర్షి భార్య అనసూయ మహా పతివ్రత. ఆమె పాతివ్రత్యానికి

సంతోషించిన త్రిమూర్తులు ఆమెను వరం కోరుకోమనగా త్రిమూర్తులు తమ దివ్యాంశాలతో తనకు పుత్రులుగా జన్మించాలని కోరింది. వారు తథాస్తు అన్నారు. ఆ వర ప్రభాం వలన బ్రహ్మ అంశతో ఓషధులకు మూల కారకుడైన అమృతకిరణుడు చంద్రుడు పుట్టాడు. రుద్రాంశతో దుర్వాస మహర్షి, విష్ణుంశతో దత్తాత్రేయుడు జన్మించారు. (చూడండి మార్కండేయ పురాణం)

చంద్రుడు దేవతలకు తన అమృతకిరణాలను ఆహారంగా ఇచ్చేవాడు. ఆయన వెన్నెల వల్ల ఔషధులు, అందునా ముఖ్యంగా సోమలత పెరిగేవి. సోమపానం వలన దేవతలకు దేహ పుష్టి, కాంతి అభివృద్ధి చెందేవి. ఇలా ఉండగా ఒకనాడు ఇంద్రుడు ఐరావతం మీద ఠీవిగా కూర్చొని సంచరిస్తున్నాడు. అదే సమయంలో అటుగా వస్తున్న దుర్వాసుడు ఒక దివ్య మాలను ఆయనకు కానుకగా ఇచ్చాడు. ఆయన ఆ మాలను అహంకారంతో ఏనుగు కుంభ స్థలంమీద పారవేసాడు. ఆ మాలలోని పూలలోని తేనె కోసం తుమ్మెదలు ఏనుగు కుంభ స్థలం చుట్టూ రొద చేయడంతో ఐరావతం మాల నేలపై వేసి కాలరాసింది. ఇదంతా చూస్తున్న దుర్వాసునికి తానిచ్చిన మాలను అవమానించిన ఇంద్రునిపై అగ్రహం కలిగింది. అసలే ఆయనకు శాపాయుధుడు అని పేరు. వెంటనే ఇంద్రుని ఐశ్వర్యం నీటిపాలు కావాలని శపించాడు. ఇంద్రుని సమస్త ఐశ్వర్యాలు సముద్రం పాలు అయ్యాయి. ఇంద్రాదుల ఆహారం హోమకారకుడు అయిన చంద్రుడు కూడా సముద్రంలో కలిసిపోయాడు.

దారిద్ర్య పీడితుడైన ఇంద్రుడు శ్రీమన్నారాయణుని సలహాతో రాక్షసులను కూడా కలుపుకొని, మందర పర్వతం కవ్వంగా, వాసుకి కవ్వపు త్రాడుగా క్షీరసాగరం మథించాడు. ఆ క్షీరసాగరం మధ్య నుండి చంద్రుడు పునర్జన్మ పొందాడు.

**చంద్రుని పెళ్ళి :** దక్ష ప్రజాపతి కుమార్తెలలో అశ్వని మొదలుకొని రేవతి

వరకు ఉండే 27గురు (తరువాయి కాలంలో వీరే నక్షత్రాలయ్యారు) చంద్రుని వరించగా, వారి కోర్కె కాదనలేని దక్షుడు వారి నందరను చంద్రునకిచ్చి వివాహం చేసాడు. ఐతే చంద్రుడు తక్కిన భార్యలను నిర్లక్ష్యం చేసి రోహిణిని మాత్రం ప్రేమతో ఆదరించేవాడు. ఇది తెలిసిన దక్షుడు - చంద్రుని మందలించి, మరొకసారి ఇలా జరిగితే శపిస్తానని బెదిరించాడు. ఐనా చంద్రుడు మారక పోవడంతో క్షయరోగివి కమ్మని దక్షుడతనిని శపించాడు.

ఘోరశాపానికి గురై చంద్రుడు క్షీణించడంతో ఓషధులు కూడా క్షీణించిపోయాయి. చివరకు దేవతలు మొరపెట్టగా బ్రహ్మ సలహాపై చంద్రుడు భూలోకంలో సముద్ర ప్రాంతంలోని ప్రభాస క్షేత్రం చేరాడు. ఇప్పుడు దానిని సౌరాష్ట్రం అంటున్నారు. గుజరాత్‌లో ఉన్నదిది. అక్కడే శివుని లింగాన్ని ప్రతిష్ఠించి, అర్చన చేయుగా శివుడనుగ్రహించి, శుక్లపక్షంలో వృద్ధి, కృష్ణ పక్షంలో క్షయం జరుగుతుందని చంద్రుని శాపాన్ని మార్చి చంద్రుని శిరస్సున ధరించి గ్రహాలలో రెండవ గ్రహంగా నిలబెట్టాడు. అంతేకాక చంద్రప్రతిష్ఠిత లింగాన్ని సోమేశ్వర లింగంగా పేర్కొని ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా చేసి చంద్రునికి శాశ్వత కీర్తి కూడా కల్పించాడు. చంద్రుడు సౌఖ్యదాయి అని శివపురాణం చెబుతున్నది.



## 3 కుజుడు లేక అంగారకుడు


**కుజ మంత్రం : ఓం క్రాం క్రీం క్రౌం సః భౌమాయనమః**

దీనిని 7 వేలు సార్లు జపం చేయించుకొంటే మంచిది.

దానం - **కందులు**, కుజనికి పగడం ప్రీతి

దక్షుని కూతురు సతీదేవిని పరమేశ్వరుడు వివాహం చేసుకున్నాడు. ఒకనాడు బ్రహ్మ సభలో తన రాకను చూసి కూడా లేవలేదని కోపంతో దక్షుడు శివనింద చేయడమేకాక ఆయనపై ద్వేషంతో శివరహితమైన యాగం

చేసాడు. ఆ యాగానికి, శివుడు వారించినా వినక చూడడానికి వెళ్ళిన సతి తండ్రి తిరస్కారానికి గురై యోగాగ్నిలో దగ్ధమైపోయింది. శివుడు వీరభద్రుని సృష్టించి యాగం నాశనం చేసి దక్షుని సంహరింపజేసి మరల దేవతల ప్రార్థనపై దక్షునికి గొర్రె తల నిచ్చి బ్రతికించి యాగం పూర్తి చేయించాడు. సతీదేవీ వియోగం భరించలేని మహాదేవుడు వేల సంవత్సరాలు కఠోర తపస్సు చేసాడు, హిమాలయాలలో, అప్పుడు ఆయననుదుటి నుండి చిత్రమైన స్వేద బిందువులు పుట్టాయి. భగవంతునికి చెమట పట్టడం రెప్పపాటువంటి మనుజ లక్షణాలుండవుకాని అమోఘమైన తన దివ్య సంకల్పంతో స్వామి ఆ శ్రమ కణాలు సృష్టించుకొన్నాడు. ఆ బిందువులు నేలపై రాలగా పవిత్రమైన అమోఘమైన శివుని శ్రమ బిందువులను భూదేవి భద్రంగా తన కడుపులో దాచుకున్నది. వెంటనే గర్భం ధరించింది. ఆమెకు ఒక కొడుకు పుట్టాడు. భూమికి పుత్రుడు కనుక అతనిని భౌముడు అని, కుజుడని అన్నారు. ఆ బాలుడు నాలుగు భుజాలతో అరుణ వర్ణంతో ఏడుస్తూ శివుని దగ్గరకు చేరాడు. శివుడు ఆ పిల్లవానిని కన్న భూమిని దీవించి బాలుని పెంచే బాధ్యత భూమికే ఇచ్చాడు. బాలుడు పుట్టిన ప్రదేశం ఉజ్జయిని దగ్గర ఉన్నది. (దీనిని బట్టి భూమికి ఉజ్జయిని గర్భం అని తేలుతున్నది) (అందుకే కాబోలు ఆ ప్రదేశాన్ని మధ్యప్రదేశ్ అంటారు) పెరిగి పెద్దవాడైన బాలుడు కాశీకి పోయి శివుని గూర్చి తపస్సు చేసాడు. ఆ బాలుని తపస్సుకు మెచ్చి శివుడు అతనిని మూడవ గ్రహంగా చేసాడు. తపశ్శక్తితో అగ్నివంటి తేజస్సు సంపాదించిన ఆ బాలునకు అంగారకుడు అని పేరు వచ్చింది.



## 4. బుధుడు

**బుధుని మంత్రం : ఓం బ్రాం బ్రీం బ్రౌం సః బుధాయనమః**

దీనిని 17 వేలుసార్లు జపం చేయించుకోవాలి.

దానం - పెసలు, బుధునికి పచ్చ ప్రీతి

చంద్రుడు బృహస్పతికి శిష్యుడు. పరమ సుందరుడు. గురుపత్ని తార చంద్రుని తన భర్త దగ్గర చదువుకునే రోజుల్లో చూసి మోహించి ఒకనాడు అతని అంతః పురానికి వెళ్లిపోయింది. చంద్రుడు కూడా వ్యామోహంలో పడి గురు తల్ప గత దోషం పట్టించుకోక ఆమెతో కామకేళీ గతుడై సర్వం మరచిపోయాడు. భార్య కోసం దుఃఖించిన బృహస్పతి తన భార్యను తిరిగి పంపించమని చంద్రుని కోరగా చంద్రుడు అందుకు తిరస్కరించాడు. దుఃఖించిన బృహస్పతి ఇంద్రునితో మొరపెట్టుకున్నాడు. ఇంద్రుడు గురుని ఓదార్చి చంద్రుని వద్దకు దూతను పంపి గురుపత్నిని తిరిగి పంపమని పరదారను, అందునా గురుదారను పొందడం మహాపాపమని హెచ్చరిక చేసాడు. పర స్త్రీ సంగమం గురించి అహల్యా జారుడవు నీవా నాకు చెప్పునది అని ఇంద్రుని ఆక్షేపించాడు చంద్రుడు. ఈ సంగతి తెలుసుకున్న శుక్రుడు చంద్రుని చేరి బృహస్పతితో దేవతలతో తనకున్న వైరాన్ని దృష్టిలో పెట్టుకుని తారను గురునికి ఈయవద్దని తాను అతనికండగా నిలబడతానని చెప్పాడు. చివరకు వాదం పెరిగి ఇంద్రుడు దేవసైన్యంతో చంద్రునిపై దండెత్తిరాగా చంద్రునికి రాక్షస సైన్యంతో శుక్రుడు తోడు నిలబడ్డాడు. దేవదానవ యుద్ధం భీకరంగా సాగింది. ఆ సమయంలో బ్రహ్మ వచ్చి చంద్రుని మందలించి తారను గురునికి అప్పగించి యుద్ధం ఆపాడు. ఆ సమయానికి తార నిండు గర్భవతి. గురుని దగ్గరకు వెళ్ళిన స్వల్పకాలనానికి ఆమెకు పుత్రుడు పుట్టాడు. అయునికి జాత కర్మాదులు చేయాలని బృహస్పతి సంకల్పించే సమయంలో ఆ పుత్రుడు తన సంతానమని చంద్రుడు పేచీ పెట్టాడు. మళ్ళీ దేవదానవ యుద్ధం ప్రారంభమయింది. శుక్రుడు చంద్రునివైపు చేరడంతో బ్రహ్మ వచ్చి యుద్ధం ఆపి తారను పిలిచి చపలత్వంతో ఇంత గొడవకు మూలకారణం అయ్యావని మందలించి ఈ బిడ్డ ఎవరి బిడ్డో తేల్చమనగా ముమ్మాటికీ చంద్రుని కొడుకే నన్నదామె. చంద్రుడు ఆ పుత్రుని తీసుకొనిపోయి బుధుడని పేరుపెట్టాడు. బుధుడు శివుని తన తపస్సుతో మెప్పించి గ్రహంగా మారాడు.

# 5. బృహస్పతి ( గురుడు)



గురు మంత్రం : ఓం ప్రాం ప్రీం ప్రౌం సః బృహస్పతయేనమః

ఈ మంత్రం 16 వేల సార్లు జపం చేయించుకోవాలి. దానం **సెనగలు**

గురునికి ప్రీతియైన **రత్నం పుష్యరాగం**

బ్రహ్మ ముఖం నుండి పుట్టిన మహాత్ములలో అంగిరసుడు అను ప్రజాపతి మహా తపస్వి. ఈయనకు చిత్ర శిఖండి అని కూడా పేరు.

ఒకప్పుడు అగ్ని దహన కార్యక్రమాలపై అసహ్యించుకొని అడవికి పోయి తపస్సు చేసుకోసాగాడు. అగ్ని లేక హోమాదులు, వంటలు, సర్వకార్యాలు స్తంభించిపోయాయి. దేవతలు, మానవులు హాహాకారాలు చేసి బ్రహ్మకు విన్నవించుకోగా ఆయన అంగిరసుడిని పిలచి, అతనికి అగ్ని పదవిని ఇచ్చి, అగ్ని నిర్వర్తించే కార్యాలన్నీ చేయమన్నాడు. అంగిరసుడు ద్వితీయాగ్నియై సమర్థంగా తన కార్యాలు సాగించాడు. ఈ లోపు తపస్సు చేస్తున్న అగ్ని తన దిక్పాలక పదవితపస్సులో పడి వదిలినందుకు భయపడి, పదవి పోతుందేమోనని శంకించి తపస్సువీడి వచ్చాడు. తీరా చూస్తే తన బదులు, అంగిరసుడు దివ్య తేజస్సుతో వెలిగిపోతున్నాడు. అగ్ని తెల్లబోయి వెనుదిరిగి అడవికి తపస్సుకు పోదామనుకుంటుండగా అతనిని గమనించిన, అంగిరసుడు నమస్కరించి నీ పదవి నీవు తీసుకోమని కోరగా నేను రెండవ అగ్నిగా ఉంటాను. నీవు ప్రథమాగ్నిగా ఉండమని అగ్ని పలికాడు అందులకు తిరస్కరిస్తూ. అంగిరసుడు అగ్నినే ప్రథముని చేయడమేకాక తనను అగ్నికి ప్రథమ పుత్రునిగా చేసుకోమని ప్రార్థించగా అగ్ని హోత్రుడు సమ్మతించాడు. అప్పటినుండి ఆయన అగ్ని పుత్రుడు అయ్యాడు.

ఆపై అంగిరసునకు శివ అను స్త్రీతో వివాహమయినది. అగ్ని తేజస్సుతో ఆయనకు ఏడుగురు పుత్రులు పుట్టారు. వారిలో ఒకడు బృహస్పతి. తన తపస్సు అధ్యయనాదులతో మహా బుద్ధిమంతుడై దేవగురువయ్యాడు బృహస్పతి. "బుద్ధికి బృహస్పతి" అను కీర్తి పొందాడు.

## 6. శుక్రుడు



**శుక్ర మంత్రం : ఓం ద్రాం ద్రీం ద్రౌం సః శుక్రాయ నమః**

దీనిని ఇరవై వేలు సార్లు జపించి బొబ్బర్లు దానం చేస్తే మంచిది.

**శుక్రునికి వజ్రం ప్రీతి**

భృగుమహర్షి పుత్రుడు శుక్రుడు. ఇతని అసలు పేరు కవి లేక కావ్యుడు. ఈయన శివుని గూర్చి వేయి సంవత్సరాలు ధూమపానం చేస్తూ అధోముఖుడై తపస్సు చేసాడు. శివుడు అతనికి ప్రత్యక్షమై మృత సంజీవినీ విద్య ప్రసాదించాడు. చచ్చినవారిని బ్రతికించే విద్య అది. ఈ విద్య గణపతి, కుమారస్వామి, పార్వతి, పరమేశ్వరుడు ఈ నలుగురు మాత్రమే ఎరుగుదురు.

ఒకప్పుడు అంధకాసురుడు తన రాక్షస గణాలతో శివునితో పోట్లాడుతుండగా ప్రమధ గణాలవల్ల చచ్చిన రాక్షసులను ఎప్పటికప్పుడు మృత సంజీవినీ విద్యా ప్రభావంతో బ్రతికించసాగాడు కావ్యుడు. దీనితో విసిగిపోయిన నందీశ్వరాదులు శివునికి విషయం చెప్పి ఇలాగైతే మనకు గెలుపు ఎలా వస్తుంది అనగా శివుడు నందీశ్వరుడిని పంపి శుక్రుడిని తెప్పించి తెల్లనివాడైన అతనిని పెరుగుతో కలిపిన చద్ది అన్నం ముద్దలాగా గుటుక్కున మింగివేసాడు. తదనంతరం అంధకాసురుడిని సంహరించాడు. శుక్రుడు చాలా కాలం శివుని కడుపులోనే ఉండిపోయాడు.

శివుడు శుక్రుడిని మింగటానికి ఇంకొక కారణం కూడా భారతం శాంతి పర్వంలో ఉంది. ఒకప్పుడు కుబేరుని మోసగించి శుక్రుడు ఆయన ధనం అపహరించగా కుబేరుడు శివునితో మొరపెట్టుకున్నాడు. ఈ కారణం

కూడా శివునికి శుక్రునిపై ఆగ్రహం తెప్పించింది. ఏతావాతా ఆయన శుక్రుడిని మింగివేశాడు.

కొంతకాలానికి శుక్రునిపై జాలికలిగి శివుడు తన లింగం ద్వారా చరమధాతు ద్రవరూపంతో బయటకు రానిచ్చాడు. రాక్షస గురువును. అప్పటి నుండి ఆయనకు శుక్రుడు అని పేరు వచ్చింది. బయటకు వచ్చిన శుక్రుని చూసి మళ్ళీ కోపగించుకోబోతున్న శివునితో నీ కడుపునుండి పుట్టడంతో వీడు నీ కొడుకు అయ్యాడు. వీడిని క్షమించమని పార్వతి అన్నది. శివుడు అతనిని పుత్రునిగా గౌరవించి వీడ్కోలు ఇచ్చాడు. అప్పటికప్పుడే బయలుదేరి శుక్రుడు కాశీలో శివుని పూజించి తన పేరుమీద శుక్రేశ్వర లింగాన్ని కూడా స్థాపించాడు. శివుడు అనుగ్రహించి అతనిని గ్రహంగా మార్చాడు.

## 7 శని



**శని మంత్రం : ఓం ఖ్రాం ఖ్రీం ఖ్రౌం సః శనయేనమః**

దినిని 19 వేలు సార్లు జపం చేయించుకుటే మంచిది

నువ్వుల దానం శుభప్రదం, శనికి నీలం ప్రీతిపాత్రం

ఛాయాదేవికి, సూర్యునికి పుట్టిన సంతానంలో రెండవ వాడు శనైశ్చరుడని సూర్యుని కధలో చెప్పుకున్నాం. గ్రహాలలో బలమైనది శనిగ్రహం. శనైశ్చరుడు శివుని గూర్చి కఠోర తపస్సు చేసాడు. వారణాసికి వెళ్ళి విశ్వేశ్వరుని పూజించి విశ్వేశ్వర లింగానికి దక్షిణంగా శుక్రేశ్వర లింగానికి ఉత్తరంగా తన పేరుతో ఒక లింగప్రతిష్ఠ చేసాడు. శివుడు అతనికి గ్రహ స్థానం కల్పించటమే కాక తనను కూడా పీడించగల శక్తి నిచ్చాడు.

ఒకసారి శని శివుని పీడిస్తానన్నాడు. శివుడు అతనికి దొరకరాదని ఒక కీకారణ్యంలోకి వెళ్ళి ఒక చెట్టు తొర్రలో దాక్కున్నాడు. ఒక రోజు తరువాత బయటకు వచ్చి "ఏది నన్ను ఏమి చేయగలిగావనగా" శని నవ్వి

-లోకేశ్వరుడవు చెట్టు తొఱ్ఱలో దాక్కున్నావంటే అది నా మహిమగాక ఏమిటి?" అన్నాడు. శివుడు నవ్వుకున్నాడు. శివుడు ఇచ్చిన శక్తిని శివుని పైనే ప్రయోగించి విఱ్ఱవీగాడు శని.

కొంత కాలానికి రుద్రవీర్యంతో భూలోకంలో వాయువు వరంతో కేసరికి, అంజనకు ఆంజనేయుడు పుట్టాడు. ఆయన గంధమాదన పర్వతంపై శ్రీరామ సంకీర్తనలో ఉండగా శని ఆయనను పట్టి పీడిస్తానని చెప్పి శపథం చేయగా తన తలపైకెక్కిన శనిపై రామనామం జపిస్తూ ఒక బండ రాతిని పెట్టాడు హనుమంతుడు. నలిగిపోయి క్షమించమని కోరాడు శని. అప్పటికి ఏదో విధంగా తప్పించుకునిపోయిన మందునికి హనుమపై పగ పెరిగి మరొకసారి శనివారం ఆయనను పీడించటానికిపోగా శని కంఠాన్ని ఈ సారి తోకతో బంధించి సేతు ప్రదక్షిణ చేసి, కొండల కేసి కొట్టి సముద్రంలో ముంచి శనిని ఘోరవేదన పాలు చేసాడు మారుతి. శ్రీరామ భక్తుని పీడించడానికి వచ్చి ఆయన వల్లనే పీడించబడిన శని ఆయన పాదాలపై పడి క్షమించమని కోరగా శనివారం గంధ సిందూరం, తైలం (కేవలం నువ్వుల నూనె) తమలపాకులతో, ఫలాదులతో ఆంజనేయుని అర్చించినవారిని శని పీడించరాదని ఆజ్ఞాపించగా అలాగే చేస్తానని ప్రమాణం చేసాడు.

కనుక శనివారం హనుమంతుని పూజిస్తే ఏలినాటి శని దోషాలు తొలుగుతాయి. ఈ విధంగా రుద్రుడు తన కుమారుని పైన హనుమంతుని రూపంలో శని భంజన చేసాడు.

పూర్వం పిప్పలుడనే బ్రహ్మారాక్షసుడు లోకాలను ఓడించగా మహాబలి శని అతనిని సంహరించాడు. దానితో అతనికి బ్రహ్మ హత్యాపాతకం చుట్టుకున్నది. బ్రహ్మ సలహాపై వృద్ధ గౌతమీ తీరంలో శివలింగ ప్రతిష్ఠ

చేసి తన దోషం తొలగించుకున్నాడు శని. అదే ఈ నాటి మందపల్లిలో ఉన్న మందేశ్వర లింగం.

శనివారం అందునా మరి ముఖ్యంగా శని త్రయోదశినాడు మందేశ్వరునికి నువ్వులనూనెతో అభిషేకం చేసినా, నల్లని వస్తువులు సమర్పించినా శని దోషాలుతొలగించి వారిని అనుగ్రహిస్తానని శపథం చేసాడు శని. ఏలినాటి శని, అష్టమ అర్థాష్టమ శని దోషాలన్నీ తొలగిపోవటానికి మంచి మార్గం మందేశ్వరాభిషేకం.

## 8. రాహువు



**రాహు మంత్రం : ఓం బ్రాం బ్రీం బ్రౌం సః రాహవేనమః**

18 వేల సార్లు జపం చేయించుకుంటే మంచిది.

దానం **మినుములు, గోమేధికం** ఈయనకు ప్రీతి

ఒకప్పుడు దేవదానవులు క్షీరసాగరాన్ని మథించారు. అందులోనుండి ఎన్నో వస్తువులు చంద్రాదులు పుట్టుకువచ్చాక చివరగా అమృతం పుట్టింది. రాక్షసులు అమృత భాండాన్ని దౌర్జన్యంగా అపహరించి త్రాగటానికి వారిలోవారు కలహిస్తుండగా, దేవతలు చింతాక్రాంతులై శ్రీహరిని ధ్యానించగా ఆయన మోహినీరూపంతో ప్రత్యక్షమయ్యాడు. పాల సముద్రంలోని మీగడ మీది మిసిమిలాగా ఉన్నది, ఆయన మేని ఛాయ వాలుచూపులు, ఉందాలేదా అనిపించే నడుముతో కనిపిస్తున్న మోహినిని చూచి మహా మోహంతో రాక్షసులు ఆమె వెంట పడ్డారు. తన హొయలతో వన్నె చిన్నెలతో శృంగార చేష్టలతో వారిని ఆకట్టుకుని అమృత భాండాన్ని వారినుండి కైవసం చేసుకున్నది కుహనా సుందరి. పైపెచ్చు అమృతం ఎలా పంచినా ఆమెను తప్పు పట్టమని వారంతా ముక్తకంఠంతో ప్రతిజ్ఞ చేసారు.

మోహిని దేవతలను ఒక పంక్తిలో దానవులను మరొకపంక్తిలో కూర్చోబెట్టి దేవతలకు అమృతం రాక్షసులకు శృంగార భరిత దృష్టి సుధ పంచిపెట్టింది. శ్రీహరి రాక్షసులను వంచిస్తున్న విషయం గ్రహించి రాహువు అనే దైత్యుడు అమృతం కపటంతోనే త్రాగాలని నిశ్చయించి దేవ రూపం దాల్చి దేవ పంక్తిలో కూర్చొన్నాడు. మోహినీ రూపంలోని హరి వాడికి కూడా అమృతం పోసాడు. ఇంతలో సూర్యచంద్రులు సైగ చేయడంతో శ్రీహరి అమృతం తాగుతున్న రాహువును చక్రంతో ఖండించాడు. అమృతం గొంతు దిగ కుండానే తల తెగిపోయింది. తెగిన తలను శ్రీహరి గ్రహంగా మార్చి శాశ్వతత్వం అనుగ్రహించాడు. తన తల తెగటానికి మూలకారకులైన సూర్యచంద్రులిద్దరిని ఏడాదికొక్కసారి రాహువు వైరంతో మ్రింగుతుంటాడు. అవే సూర్య చంద్ర గ్రహణాలు. ఈ రాహువు సింహిక అనే రాక్షసి పుత్రుడు. కాబట్టి ఇతనిని సైంహికేయుడు అని కూడా అంటారు.



## 9. కేతువు

**కేతు మంత్రం : ఓం ప్రాం ప్రీం ప్రౌం సః కేతవేనమః**

7వేలు జపం చేయించుకోవాలి. దానం **ఉలవలు, వైడూర్యం ప్రీతి.**

రాహువు యొక్క మొండెమే కేతువుగా కొంత ప్రచారముంది. ఇంతకు మించి కేతువు పుట్టుకకు సంబంధించిన కథ దొరకదు. కేతువు చిత్ర వర్ణుడు ఇతడు రౌద్ర గ్రహం. శివుని గూర్చి తపస్సు చేయగా శివుడు ఇతనిని గ్రహంగా మార్చాడు.

**సర్వేజనా స్సుఖినోభవంతు లోకాస్సమస్తా స్సుఖినోభవంతు**